ప్రజాశక్తి
గురువారం 6 ఫిబ్రవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

భద్రతపై అశ్రద్ధ

- హెటిరోలో ఆగని ప్రమాదాలు
- యధాలాపంగా లోపాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని ఔషధ పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు భయంగొల్పుతున్నాయి. ఫార్మాలో ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా, ఎంతమంది చనిపోతున్నా, గాయాలపాలవుతున్నా ప్రభుత్వంగానీ, యాజమాన్యాలుగానీ పాఠాలు నేర్వడం లేదు. ప్రమాదాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవడంలేదు. మరోవైపు ప్రమాద నివేదికలు ఎక్కడా బయటకు రావడం లేదు. ఇది విస్మయం గొలిపే అంశం.

గతేడాది ఆగస్టు 21న అసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17 మంది మృతిచెంది, 38 మంది గాయపడిన తరువాత ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ ఈ నాటికీ వెలుగుచూడలేదు. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాల్సిన కమిటీ ఏమైందో తెలియని పరిస్థితి. పరిశ్రమల ప్రమాదాలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతో నియంత్రించే చర్యలు యాజమాన్యాలు తీసుకోవడంలేదు. నక్కపల్లి మండలంలోని హెటిరో డ్రగ్స్ కంపెనీలో మంగళవారం విష వాయువు లీకవడంతో భోజనం చేయడానికి క్యాంటీన్‌కు వెళ్తున్న 12 మంది అస్వస్థతకు గురయ్యారు. ప్రాణాపాయం లేకపోవడంతో అటు యాజమాన్యం, ఇటు ప్రభుత్వ యంత్రాంగం ప్రమాదాన్ని తేలిగ్గా తీసుకుంటున్నట్లు కనబడుతోంది. భద్రత, రక్షణ ప్రమాణాలను పాటిస్తే ఈ ప్రమాదం చోటుచేసుకొనివుండేదికాదు.

సోడియం హైపో క్లోరైట్‌కు హైడ్రో క్లోరిక్ యాసిడ్ (హెచ్‌సిఎల్) యాడ్ అయ్యే క్రమంలో వెలువడిన క్లోరిన్ గ్యాస్ (సిఎల్2) పక్కనున్న ఇటిపిలోని వ్యర్థాలకు చేరడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషవాయువులు బయటకు రాకుండా లీకేజీలను అరికట్టే చర్యలు మిగతా 2లో..

వార్త 8లో..



కేర్ హాస్పిటల్‌లో క్షతగాత్రున్ని పరామర్శిస్తున్న లోకనాథం, కుమార్, మణి

హెటిరోపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధి ప్రకటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నూతన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిని బుధవారం అధికారులు ప్రకటించారు. సవరించిన డివిజన్ల ప్రకారం పలాస, విశాఖపట్నం, దువ్వాడ, కూనేరు - విజయనగరం, నౌపాడ జంక్షన్, పర్లాకిమిడి, బొబ్బిలి జంక్షన్, సాలూరు, సింహాచలం ఉత్తర, దువ్వాడ బైపాస్, వడ్లపూడి దువ్వాడ, విశాఖ ఉక్కు కర్మాగారం, జగ్గయ్యపాలెంలతో కూడిన సుమారు 410 కిలోమీటర్ల పరిధిగల ప్రాంతాన్ని న్యూ సౌత్ కోస్ట్ రైల్వే కింద వాల్తేరు డివిజన్‌గా ఉంచుతారు. దీని పేరును విశాఖ డివిజన్‌గా మార్చనున్నారు. అదేవిధంగా వాల్తేరు డివిజన్‌లోని మరో భాగమైన కొత్తవలస - బచేలి / కిరండూల్, కూనేరు - తేరువలి జంక్షన్, సింగాపూర్ రోడ్, అరకు, కోరాపుట్ జంక్షన్, పర్లాఖిముడి - గన్‌పూర్ స్టేషన్ల మధ్యనున్న సుమారు 680 కిలోమీటర్ల పరిధిలోని భాగాన్ని ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని రాయగడలో హెడ్ క్వార్టర్‌తో కలిపారు.

విశాఖ రైల్వే డివిజన్‌లో కెకె లైన్‌ను కొనసాగించాలి : సిపిఎం

విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు విశాఖపట్నం రైల్వే డివిజన్‌ను కొనసాగించాలని నిర్ణయించిందని, అయితే, అందులో అత్యంత లాభాలు గడించే కొత్తవలస - కిరండోల్ లైన్‌ను మినహాయించడం ఆమోదయోగ్యం కాదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టానికి అనుగుణంగా విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు తీవ్ర తాత్సారం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పదేళ్ల తరువాత కొద్ది రోజుల క్రితం ప్రధానమంత్రి రైల్వే జోన్ భవనానికి శంకుస్థాపన చేశారన్నారు. జోన్ పేరున వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన వాల్తేరు రైల్వే డివిజన్ ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయించగా దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తమైన విషయాన్ని జగ్గునాయుడు గుర్తుచేశారు. దీనికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం పేరు మార్చి, పరిధి మిగతా 2లో..



నేడు పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరి నామినేషన్

వార్త 2లో..

దుర్గాలమ్మ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

వార్త 2లో..

'ఆ భూమిపై అభ్యంతరాలుంటే తెలపండి'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులపై రాష్ట్రంలోని 'కూటమి' ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ఇప్పటికే మిగులు భూములు, ప్రభుత్వ డి పట్టా భూములపై జీవోలను జారీచేస్తూ ఎక్కడెక్కడ కేటాయింపులు జరిగాయో ఆరా తీస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆనందపురం మండలం కుసులవాడ గ్రామంలో సర్వే నెంబర్ 59(పి)లో 5 ఎకరాలను జగన్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 15న చేసిన కేటాయింపులపై తాజాగా తహశీల్దార్ కార్యాలయం నుంచి పంచాయతీకి నోటీసును పంపింది. అప్పట్లో జరిగిన అలినేషన్ వివరాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే 15 రోజుల్లో తెలపాలని, అందుకు సంబంధించి దండోరా కూడా వేయాలని కుసులవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆనందపురం తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్ నోటీసు పంపారు.

అప్పట్లోనే 'ప్రజాశక్తి'లో కథనం

2019-2024 మధ్యకాలంలో విశాఖ దక్షిణం వైసిపి మిగతా 2లో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

లేబర్ కోడ్స్‌పై నిరసనల వెల్లువ

రద్దు చేయాల్సిందే : కార్మిక సంఘాల నేతలు

వార్తలు 7లో..

మొదటి పేజీ తరువాయి..

భద్రతపై అశ్రద్ధ

చేపట్టగలిగితే ఈ ప్రమాదం కూడా చోటుచేసుకొనివుండేదికాదు. హెటిరోలో గతంలో ప్రమాదాలు జరిగిన సందర్భంలో మరణాలు సంభవించాయి. అయినా యాజమాన్యం ముందస్తు జాగ్రత్తలు, కార్మికుల్లో అవగాహన కల్పించే చర్యలు తీసుకోలేదు. 2022 ఫిబ్రవరిలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. ప్రెజర్ రిలీఫ్ వాల్వ్, రప్చర్ డిస్క్ ఏర్పాటు చేయకపోవడంతో రియాక్టర్ పేలినట్లు అప్పట్లో విచారణాధికారులు గుర్తించారు. హెటిరో యాజమాన్యం కార్మికుల భద్రతపై శ్రద్ధ తీసుకోదన్న విమర్శలు అప్పటి నుంచీ వినిపిస్తూనేవున్నాయి. 2013 జనవరి 5న జరిగిన ప్రమాదంలో నలుగురు, ఆగస్టు 14న జరిగిన ప్రమాదంలో ఒకరు, 2015 నవంబరు 10న ఒకరు, 2016 జూన్ 22న ఒకరు, 2020లో ఒకరు, 2022 ఫిబ్రవరి 23న ఒకరు ప్రమాదాల్లో చనిపోయారు. ఫార్మా కంపెనీల ప్రమాదాల నేపథ్యంలో భద్రతా ప్రమాణాల నిర్వహణపై 2020 జులై 16న అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ నాలుగు బృందాలను నియమించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశ్రమల నిర్వహణ వుందా ? లేదా ?, అలాగే కార్మికులకు రక్షణ పరికరాల సరఫరా, కంపెనీలో భద్రతా ప్రమాణాల పాటింపు, ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ వంటి పలు ప్రమాణాల అమలును పరిశీలించేందుకు, ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన ప్రత్యేక భద్రతా ప్రమాణాలపై నివేదిక ఇచ్చేందుకు అప్పట్లో బృందాలను నియమించారు. భద్రతా లోపాలను ఆ బృందాలు ఎత్తిచూపినా వాటిని సరిచేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

విశాఖ రైల్వే డివిజన్‌లో కెకె లైన్‌ను కొనసాగించాలి : సిపిఎం

కుదించి కొనసాగించాలని నిర్ణయించిందన్నారు. ఇది ఈ ప్రాంతానికి అన్యాయం చేయడమే అవుతుందన్నారు. విశాఖపట్నం రైల్వే డివిజన్‌లో కొత్తవలస – కిరండోల్ లైన్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

యధావిధిగా ఉంచాలి : సిఐటియు

వాల్తేరు డివిజన్‌ను విచ్ఛిన్నం చేయడం వల్ల రైల్వే జోన్ తలలేని మొండెంలా తయారవుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాబట్టి తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని కెకె లైన్‌తో ఉన్న వాల్తేరు డివిజన్‌ను యధావిధిగా కొనసాగిస్తూ విశాఖ రైల్వే జోన్ ఉండాలని కోరారు.

'ఆ భూమిపై అభ్యంతరాలుంటే తెలపండి'

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు చెందిన వైజాగ్ డిఫెన్స్ అకాడమీ కోసం జగన్ ప్రభుత్వం పై 5 ఎకరాలను కేటాయించింది. ఆ సందర్భంగా 'వాసుపల్లికి భూ దక్షిణం' అన్న శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ తరహా కేటాయింపులన్నింటిపైనా గ్రామ ప్రజల అభిప్రాయాలను కోరడం విశేషం.

8న వర్గీకరణ-వక్రీకరణ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి–విశాఖపట్నం : ఈ నెల 8న ఉదయం 9.30 గంటలకు రాంనగర్ పరిధి అగర్వాల్ ఐ ఆస్పత్రి వెనుక రెల్లివీధిలోని అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో మంగళగిరి ప్రసాదరావు రాసిన వర్గీకరణ – వక్రీకరణ పుస్తకావిష్కరణ జరగనుంది. ఈ పుస్తకాన్ని విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ ఆవిష్కరించనున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జివిఎంసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారి వారసులకు ఉపాధి కల్పించి విధుల్లోకి తీసుకోవాలని జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్‌కు యూనియన్ తరపున వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. ఆలస్యంగా జీతాలు చెల్లించే విధానం సరికాదన్నారు. మిస్సయిన జీతాలు, సప్లమెంటరీ బిల్లులు చెల్లించాలని, బకాయి హెల్త్ అలవెన్స్ చెల్లించాలని కోరారు. నాణ్యతమైన పనిముట్లు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జెఆర్.నాయుడు, ఇ.ఆదినారాయణ, గొలగాని అప్పారావు పాల్గొన్నారు.

నేడు పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరి నామినేషన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటలకు సరస్వతి పార్కు నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన ఉంటుందని యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 గంటలకు నామినేషన్ వేస్తారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేరొక ప్రకటనలో జన విజ్ఞాన వేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు.

దుర్గాలమ్మ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పూర్ణామార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతరోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పి. శ్రీలేఖ చెప్పారు. బుధవారం దేవస్థానంలో జరిగిన కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 3 రోజులు పాటు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, అందుకు సంబంధించి అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తాయని తెలియజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా దేవాదాయ శాఖ, పోలీస్, జివిఎంసి సిబ్బంది తగు సహకారం అందివ్వాలని ఆదేశించారు. ప్రతిరోజూ పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచాలని, తాగునీటి సరఫరా చేయాలని జివిఎంసి అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పైలా శేఖర్ బాబు మాట్లాడుతూ ఈ నెల 25న శ్రీ దుర్గాలమ్మవారి తొలేళ్ళ ఉత్సవాన్ని, 26న మహాశివరాత్రి పర్వదిన వేడుకలను, 27న అమ్మవారి జాతర ఉత్సవాన్ని నేత్ర పరంగా నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా శూలాల పండగ, అగ్నిగుండాలు తొక్కుట, సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ మాట్లాడుతూ శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఉత్సవాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో జివిఎంసి జోనల్ కమిషనర్ మల్లు నాయుడు, డిఇఇ ఎ.వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐలు డి.విశ్వనాథం, కె.శ్రీలక్ష్మి, లా అండ్ ఆర్డర్ ఎస్ఐలు కె.శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలేఖ

ఘనంగా వంశీకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. విల్లూరి చిన్నతల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో 33వ వార్డులో కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి వంశీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డివిఎస్‌కె.వరప్రసాద్, శ్రీ వెంకటేశ్వర మెట్ట హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బాల సత్యారావు, ఎల్లపు నాగేశ్వరరావు పాల్గొన్నారు. వంద మంది పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

ఎంవిపి.కాలనీ : శివాజీ పాలెంలోని వంశీకృష్ణ క్యాంపు కార్యాలయంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత వంశీకృష్ణ శ్రీనివాస్ సతీ సమేతంగా కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తదితరులు ఉన్నారు.

సీతమ్మధార : జనసేనపార్టీ నగర అధ్యక్షులు, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు సీతంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. 27వ వార్డు జనసేన అధ్యక్షులు గుండు సురేషబాబు (చంటి), వార్డు కార్పొరేటర్ గోలగాని వీరరావు (బుజ్జి) ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కేక్‌ను కట్ చేసి అభిమానులకు, కార్యకర్తలకు తినిపించారు.



శుభాకాంక్షలు చెబుతున్న సురేష్ యాదవ్

ములగాడ : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను పారిశ్రామిక ప్రాంతం జనసేన నాయకులు పుర్రె సురేష్ యాదవ్ తన స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు యువత తదితరులు పాల్గొన్నారు.

NOTICE TO THE RESPONDENT

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (PROHIBITION & EXCISE) AT SRIKAKULAM
D.V.C No. 20/2024

BETWEEN:
Dr Kolla Bandhavi ....Petitioners
AND
Dr Vujji Abhishek and others .....Respondents

To
R-4: Vujji Murali Krishna S/o Vujji Nooka Raju, aged 40 years, resident of D No. 3-134, Venkata Sai Nilayam, Employees Colony, First Line, Pisinikada village, Anakapalli Mandalam, Anakapalli District:

R-5 : Dr. Vujji Avinash, S/o Vujji Nooka Raju, aged 37 years, resident of Quarter No-E/31, BHPV Township, BHPV Post, Gajuwaka, Visakhapatnam, Andhra Pradesh, 530012.

* * *

Whereas your attendance is necessary that **Smt Dr. Kolla Bandhavi,** filed a complaint U/s 12 of the Protection of Women from Domestic Violence Act, 2005 against you before the **ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (PROHIBITION & EXCISE) AT SRIKAKULAM** in DVC No. 20/2024 in the same court.

Therefore you are hereby directed to appear in person before the ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (PROHIBITION & EXCISE) AT SRIKAKULAM without fail on 27th February, 2025

(By The Court order)
SRI MS VINAY BHUSHANA RAO
ADVOCATE, SRIKAKULAM. Cell No. 9440112861

IN THE HON'BLE COURT OF THE FAMILY JUDGE AT : VISAKHAPATNAM
F.C.O.P. 737/2024

Between:
Landa Polayya ...Petitioner
And
Smt. Landa Komali and another ...Respondents

NOTICE

To,
R-2: Bellagam Hemanth,
R/at D.No.34-6-1/2, Church School Sebastian Colony, Gnanapuram, Visakhapatnam.

Whereas on 25th day of March, 2024 the above named petitioner filed the above petition against the respondents on the grounds mentioned therein and the same stands posted to **12-02-2025** for your appearance. Hence you are hereby required to appear before the Hon'ble Court on the said date at **10:30 A.M.** in the forenoon in person or by Pleader duly instructed and able to answer all material questions relating to the above proceedings and file the documents in support of your contention. Also take notice that in default of your appearance on the aforesaid day the matter will be heard and determined in your absence as per the record available before the Hon'ble Court.

M.S. VENKATESH,
M.K. SRINIVAS & M. KAUSHIK
Advocates, Visakhapatnam.

IN THE HONOURABLE COURT OF THE VI ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISKAHAPATNAM
I.A. 212/2022 O.S.176/2022

Between
Sri Gopisetti Srinu **...Petitioner/Plaintiff**
And:
Sri Allam Srinivas Rao and others **...Respondents/Defendants**

NOTICE

To
3.Murru Mutyala Naidu
S/o Bangu Naidu residing at Qr No.7, CIEFL, CIEFL campus Hyderabad.
4.Murru Ramadevi
W/o Mutyala Naidu residing at Qr No.7, CIEFL, CIEFL campus Hyderabad.

Whereas the Petitioner/ plaintiff instituted the above suit against all you and the same is stand posted to **10-02-2025** for your appearance and on that day **at 10-30 am** you should appear before the aforesaid Honourable court either in person of through an Advocate without fail, else the matter will be determined in your absence.

BY COURT ORDER
P.SREENIVAS, Advocate
B-6, Pavan Enclave, Dabagardens,Visakhapatnam
Cell 9849400096

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -తగరపువలస : ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం ఆవరణలో బుధవారం సాయంత్రం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒ వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, ఇప్పుడేమో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆదర్శ పాఠశాలల ఏర్పాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీన పరిచే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పేద విద్యార్థులను ప్రభుత్వ బడులకు దూరం చేసే ప్రభుత్వ ప్రయత్నాలను,ఆయా పాఠశాలల తల్లి దండ్రుల తో కలిసి ఉపాధ్యాయులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులపై తల్లి దండ్రులకు మరింత నమ్మకం పెంచేలా మన కృషి ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పిడిఎఫ్ గత 17 ఏళ్లగా చేస్తున్న కృషి, జరుపుతున్న ఐక్య పోరాటాలను వివరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయ గౌరికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులందరినీ కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యులు డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎ.పైడిరాజు, కార్యదర్శి ఉప్పాడ రాము, మండల కమిటీ అధ్యక్షులు సిహెచ్.వి.సంతోష్, ప్రధాన కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆరిలోవ టిబిసి పాయింట్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చు శ్రీనివాసరావు, భార్య లావణ్యతో కలిసి ఆరిలోవలో నివాసముంటున్నారు. బుధవారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాసరావు ఫ్యాన్‌కు బెడ్ షీట్‌తో ఉరేసుకున్నాడు. భార్య లావణ్య విధులు నిర్వర్తించుకొని తెల్లవారు జామున ఇంటికొచ్చేసరికి తలుపులు తాళం వేసి ఉన్నాయి. వెనుక వైపు నుంచి వెళ్లగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని శ్రీనివాసరావు కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే శ్రీనివాసరావు మృతి చెందాడు. భార్య లావణ్య, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

ప్రణాళికతో బోధించాలి

ప్రజాశక్తి -మధురవాడ : ఉపాధ్యాయులు ప్రణాళికతో బోధించిన నాడే విద్యార్థులు విజయపథంలో నడుస్తారని విశాఖపట్నం జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు అన్నారు. చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తీర్ణత కోసం తీసుకోవాల్సిన చర్యలపై సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులకు సూచనలు అందజేశారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టి పిల్లలు జవాబులు రాసే సమయంలో చేసే తప్పిదాలను గమనించి ప్రోత్సహించాలన్నారు. ప్రధాన ఉపాధ్యాయులు గుట్టేట రవి మాట్లాడుతూ, సమ్మేటివ్ అసెస్మెంట్ 1 ఫలితాల ఆధారంగా విద్యార్థులను గుర్తించి వారికి సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు చేపడుతున్న ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పి.దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి -తగరపువలస : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తగ్గిస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడేమో మౌనం వహించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్ భారాలను తగ్గించకుంటే అన్ని తరగతుల ప్రజలను సమీకరించి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మోర అప్పలరాజు, ఆదినారాయణ, అల్లం గోవిందరావు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు మార్గిన్ కె హోటల్ మలుపు వద్ద జివిఎంసి ఇంజినీరింగ్, ట్రాఫిక్ పోలీస్ విభాగం సంయుక్తాధ్వర్యాన బుధవారం ఏబిఎస్ ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటుచేశారు. ఇటీవల కాలంలో ఇదే మలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, వాటిని నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటుచేసినట్లు జివిఎంసి అసిస్టెంట్ ఇంజినీర్ సురేష్, ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్.చిరంజీవి తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, ఉప విద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వరరావుతో బుధవారం గొండు సీతారాం సమావేశమయ్యారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరంలో హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య, కేటాయించిన కేంద్రాలు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, ఈ పరీక్షల్లో వసతుల లేమి, ట్రాఫిక్ నిబంధనల ఇక్కట్లు, అనారోగ్య సమస్యలు, రోడ్డు రవాణా ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థీ పరీక్షను కోల్పోకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 106 ప్రభుత్వ పాఠశాలలు, 448 ప్రైవేటు పాఠశాలల నుంచి 28515 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. వీరిలో 15089 మంది బాలురు, 13426 మంది బాలికలు ఉన్నారని వివరించారు.

కంటి గాయం చిన్నదైనా అశ్రద్ధ వద్దు

డాక్టర్ మరియా బషీర్

ప్రజాశక్తి - ఆరిలోవ : చిన్న కంటి గాయం కూడా ఒక్కోసారి దీర్ఘకాలిక పరిణామాలకు దారితీయొచ్చని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ నల్ల గుడ్డు నిపుణులు డాక్టర్ మరియా బషీర్ అన్నారు. ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యాన బుధవారం జిఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్‌లో కంటి గాయాలు వాటి నివారణ, ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మరియా బషీర్ మాట్లాడుతూ, కంటికి ఏమాత్రం చిన్న గాయమైనా దృష్టిపైన ప్రభావం చూపటమే కాక జీవన సరళికి ఆటంకం కలిగించవచ్చన్నారు. ప్రధానంగా యువత, పిల్లలు కంటి గాయాలపై శ్రద్ధ కనబరచాలని కోరారు. కంటిలో ఏదైనా నలుసు పడితే కంటిని రుద్దకుండా నీటితో కడిగే ప్రయత్నం చేయాలని, అలా చేసిన తరువాత కూడా ఉపశమనం కలగకపోతే నేత్ర వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కెమికల్స్, స్ట్రాంగ్ క్లీనింగ్ పౌడర్లు, యాసిడ్స్ వాడుతున్నప్పుడు కంటికి తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. రసాయనాలు వాడే ముందు ఉత్పత్తిదారులు ప్యాక్‌పై ఇచ్చిన సూచనలు చదివి పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు, రోగులు, రోగుల బంధువులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'సదరం' పునఃపరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన సదరం ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలన కేంద్రం వద్ద బుధవారం రెండో రోజూ కొనసాగింది. జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న బొగ్గు రోడ్డు, 1,2,3 వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న చిట్టివలస, చిల్లపేట, కొత్తపేట గ్రామాలకు చెందిన వంద మంది శారీరక వైకల్యం ఉన్న వారికి ప్రత్యేక వైద్యులు ధ్రువ పత్రాలను పునఃపరిశీలించారు. నిర్ధారణ పరీక్షలు చేశారు.

ఏడాదిగా అందని వేతనం

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఆవేదన
- ఆఫీస్ ముందు బైఠాయించి నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సముద్రం

ప్రజాశక్తి-మాడుగుల : ఏడాది కాలంగా తనకు జీతం అందక నానా అవస్థలు పడుతూ, కుటుంబ పోషణ భారమైందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, మాడుగుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ మైలపిల్లి సముద్రం బుధవారం కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సముద్రం మాట్లాడుతూ ఏడాదిగా జీతం రాకపోవడంతో కుటుంబాన్ని నెట్టుకు రావడం కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యం బాగోలేని పరిస్థితుల్లో ఆస్పత్రికి ఖర్చులు కూడా నానా ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నప్పటికీ , కావాలనే సబ్ రిజిస్ట్రార్ జీతం అవ్వకుండా సిఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో తన పేరు తప్పించారని ఆరోపించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తనకు వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఏడాదికాలంగా జీతం నిలిపివేసిన సబ్ రిజిస్ట్రార్‌పై జిల్లా అధికార యంత్రాంగం శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

దీనిపై సబ్ రిజిస్ట్రార్ పురుషోత్తం వివరణ కోరగా.. సీనియర్ అసిస్టెంట్ సముద్రం జీతం నిలుపుదల విషయంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని బదులిచ్చారు. 2024 జనవరి 27 నుంచి ఏప్రిల్ 23 వరకు తన ఆరోగ్య పరిస్థితులు బాగోక బెడ్ రెస్ట్ లో ఉన్నానని, ఆ నాలుగు నెలలు ప్రస్తుత సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న మైలపిల్లి సముద్రమే ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించారన్నారు. ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలోనే సిఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో ఫిబ్రవరి నెలలోనే సీనియర్ అసిస్టెంట్ సముద్రం పేరు తప్పిపోయిందన్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడానన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం సీనియర్ నాయకులు కాకర్లపూడి వరహాల రాజు, శ్రీకాంత్ రాజు కుటుంబ సభ్యులు, స్థానిక ఎంపిటిసి, గ్రామ ప్రజలు సుమారు వంద కుటుంబాలు గురువారం కాకర్లపూడి నివాసంలో ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాకర్లపూడి శ్రీకాంత్ మాట్లాడుతూ, భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా న్యాయం చేస్తానన్నారు. వైసిపి నుంచి తెలుగుదేశంలో చేరిన వారిలో శొంఠ్యాం కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు కాకర్లపూడి వరహాల రాజు, శ్రీకాంత్‌రాజు, మాజీ సర్పంచ్ కాకర్లపూడి సీతారామరాజు, కనమాం ఎంపిటిసి సభ్యులు గొలగాని కృష్ణ, మాజీ సర్పంచ్ మదపాటి సత్తిబాబు, సరగడం వెంకట అప్పారావు, ఎర్ర అప్పారావు, లంక సోమనాయుడు, గంగిరెడ్ల వీరన్న, లంక బంగారునాయుడు , అచ్చిరెడ్డి దేవుడుబాబు, గుర్ల రమణ, అక్కిరెడ్డి పెంటయ్య తదితరులు ఉన్నారు. వీరందరికీ టిడిపి కండువాను కప్పి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తాట్రాజు అప్పారావు, సర్పంచులు బిఆర్‌బి.నాయుడు, ఆబోతు అప్పలరాము, సోంబాబు, రమేష్‌బాబు, మీసాల సత్యనారాయణ, బంటుబిల్లి అప్పలస్వామి, జోగ ముత్యాలు, చందవరపు కుమార్, పాల్గొన్నారు.

జాలారిపేట వాసులకు కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : జిమ్‌సర్ ఆసుపత్రి ఆధ్వర్యాన పెదజాలారిపేటలో కేన్సర్‌పై బుధవారం వైద్యులు అవగాహన కల్పించారు. మద్యపానం, ధూమపానం వల్ల కేన్సర్ బారిన పడటం, దాని వల్ల కలిగే అనర్థాలు, ముందుగా పరీక్షలు చేయించుకోవడం వల్ల చికిత్స ప్రారంభించడం గురించి వివరించారు. పట్టణ ప్రాంతాల్లోని సంపన్న కుటుంబాలలో పురుషులు ఈ-సిగరెట్లు, హుక్కాలకు అలవాటు పడుతుండటం, గ్రామీణ ప్రాంతాలలో పొగాకు సంబంధ ఉత్పత్తులను వాడటం ఎక్కువగా కేన్సర్‌కు కారణం అవుతున్నాయని తెలిపారు. కేన్సర్ చికిత్సలో రోగిపై ఒత్తిడిలేని విధంగా అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ గీతాకుమారి, డాక్టర్ బి.కమలసాహితి, డాక్టర్ కెఎస్‌కె.దివ్య, జిమ్‌సర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

అవంతిలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 6, 8 తేదీల్లో గో కార్ట్ డిజైన్, ఫ్యాబ్రికేషన్‌పై నిర్వహించనున్న వర్క్ షాప్‌నకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సిహెచ్.సురేష్, వర్క్ షాప్ కో-ఆర్డినేటర్ షరీఫ్, అధ్యాపకులు విద్యార్థులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ నాన్హి కాళి ప్రాజెక్టు సంస్థ ఆధ్వర్యాన స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భవాని చేతుల మీదుగా సుమారు 204 మంది విద్యార్థులకు కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ ఎన్.భానుదివ్యప్రతిమ మాట్లాడుతూ, విద్యార్థులు ఈ ఆట వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ వై.సత్యవతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో విఎస్ఇజెడ్ ఎగుమతులు

డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల



ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ, ఉక్కునగరం : విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ (విఎస్ఇజెడ్) 2024 ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో రూ.1,99,396 కోట్ల రికార్డు స్థాయి ఎగుమతులు నమోదు చేసిందని విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల తెలిపారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 22 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. ఇందులో సేవా ఎగుమతులు రూ.1,19,786 కోట్లు, వాణిజ్య ఎగుమతులు రూ.79,610 కోట్లు ఉన్నాయని వివరించారు. 2024 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రూ.69,733 కోట్లు ఆర్జించి అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 20 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. ఇందులో సేవా ఎగుమతులు రూ.40,996 కోట్లు, వాణిజ్య ఎగుమతులు రూ.28,737 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఇదేసమయంలో విఎస్ఇజెడ్ దువ్వాడ సెజ్ 2024 అక్టోబర్-డిసెంబర్ కాలంలో 28 శాతం వృద్ధితో రూ.1,695 కోట్ల ఎగుమతులు చేసిందని, 2024 ఏప్రిల్- డిసెంబర్ మధ్య 24 శాతం వృద్ధితో రూ.7,092 కోట్ల ఎగుమతులు చేసిందని వివరించారు. ఇందులో వాణిజ్య ఎగుమతులు రూ.7,069 కోట్లు, సేవా ఎగుమతులు రూ.23 కోట్లు నమోదు చేసిందని తెలిపారు.

2024 అక్టోబర్-డిసెంబర్ కాలంలో కొత్తగా 5 సెజ్ యూనిట్ ప్రతిపాదనలు (ఆంధ్రప్రదేశ్-1, తెలంగాణ-4), కొత్తగా 4 ఈవోయు ప్రతిపాదనలు (తెలంగాణ-4) ఆమోదం పొందాయని పేర్కొన్నారు. విఎస్ఇజెడ్ ద్వారా రూ.1,12,276 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 2024 మార్చి 31 నాటికి 6,18,551 మందికి ఉపాధి కల్పించిందని పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన సెజ్ యూనిట్లు, ఈవోయు యూనిట్ల ద్వారా రూ.616.26 కోట్ల పెట్టుబడులతో 2207 మందికి ఉపాధి లభించనుందని వివరించారు.


డాక్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగి ప్రసాద్ మృతి



ప్రజాశక్తి-మాధవధార : కంచరపాలెం జోన్ నరేంద్రనగర్‌లో నివాసముంటున్న డాక్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగి ఎం.ప్రసాద్ అనారోగ్యంతో మృతిచెందారు. డాక్ యార్డు ఎన్ఎస్ఐ యూనియన్‌లో చాలా సంవత్సరాలు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పనిచేశారు. కార్మికుల సమస్యలపై చురుకుగా పాల్గొనేవారు. కంచరపాలెం జోన్‌లో సిపిఎం అకౌంట్లు రాసి పార్టీకి సహకారం అందించేవారు. విధులు ముగిశాక నేరుగా కంచరపాలెం ఆఫీసుకు వెళ్లి అకౌంట్స్ చూసి మాత్రమే ఇంటికి వెళ్లేవారు. అంత నిబద్ధతతో పార్టీలో పని చేసేవారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా సహకరించేవారు. మూడు సంవత్సరాల నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతిచెందారు. విజయనగరంలో అంత్య క్రియలు జరిగాయి. ప్రసాద్ భౌతికకాయంపై సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, జి.సూర్యచంద్రరావు, ఎస్.అప్పలరాజు, బి.సింహాచలం, ఒ.అప్పారావు, ఎస్.సోమేశ్వరరావు, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఆర్.వెంకట్రావు తదితరులు నివాళులర్పించారు.

కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం

ప్రజాశక్తి -ఉక్కునగరం : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టంచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 1455వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాలకు చెందిన ఐఎన్‌టియుసి కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణ కోసం దేశమంతా ఐక్యంగా పోరాడుతోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల మనుగడ కోసం జరుగుతున్న ఈ పోరాటం విజయం సాధిస్తుందని తెలిపారు. కుట్రపూరితంగా స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను కార్మికుల ఐక్య పోరాటాలతో తిప్పికొడతారన్నారు.



జగన్మోహన్‌రెడ్డిని కలిసి తిప్పల నాగిరెడ్డి కుటుంబీకులు

జగన్‌ను కలిసిన తిప్పల

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కుమారులు గాజువాక నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తాడేపల్లిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో గాజువాక నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించినందుకు తిప్పల దేవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థుల డే వాక్



డే వాక్‌లో విద్యార్థులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు స్కౌట్ అండ్ గైడ్స్‌లో భాగంగా బుధవారం డేవాక్ నిర్వహించారు. కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి స్టీల్ ప్లాంట్ జంక్షన్ వరకు వెళ్లి అక్కడి నుంచి జాబిల్లి అపార్ట్మెంట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కౌట్ మాస్టారు ఎస్‌వి.రమణ టెంట్లు, పోల్స్ వేయడం, టెంట్లకు ముళ్ళు వేయడం తదితర కార్యక్రమాలను పిల్లలకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పరివిన్ పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని విశాఖ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 128వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ, పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ 150 పడకల సామర్థ్యంతో నిర్మించి ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా నడుస్తుందన్నారు. పోర్టు అండ్ డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్ అయిన కార్మికులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాసీలకు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులకు, సిఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు 40 వేల కుటుంబాలకు దశాబ్దాల తరబడి సేవలందిస్తోందని తెలిపారు. అటువంటి పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో "మల్టీ డిసిప్లెనరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా 300 పడకలతో ప్రైవేటు వారికి ఇచ్చేయాలనే నిర్ణయం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాన్ని సిఐటియు వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఇది అమలైతే సుమారు 40 వేల మంది కార్మిక కుటుంబాల ఆరోగ్య భద్రతను ప్రైవేటు వారి చేతుల్లో పెట్టడమే అవుతుందన్నారు. నిరంతరం లాభాలతో నడుస్తున్న విశాఖ పోర్టు సొంత నిధులతోనే పోర్టు ఆసుపత్రిని అత్యంత మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, స్పెషలిస్ట్ డాక్టర్లను, ల్యాబ్‌లను, స్పెషలైజ్డ్ స్టాఫ్‌ను, నాణ్యమైన మందులను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేసే చర్యలను చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, అధ్యక్షులు జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావుమూర్తి, సిహెచ్‌వివిఎస్.రెడ్డి, బి.జగన్, నరసింహ రాఘవులు, జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి మెప్మా ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని ఆర్‌పిలు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును అభ్యర్థించారు. ఈ మేరకు నగర వ్యాప్తంగా ఉన్న ఆర్‌పిలు పాత గాజువాకలో తెలుగుదేశం కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే పల్లాను కలిసి తమ సమస్యలను వివరించారు. ఆర్‌పిలను తొలగిస్తామంటూ వస్తున్న వార్తలపై ఆందోళన చెందుతున్నామని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని ఆర్‌పి ఉద్యోగుల సంఘం నాయకులు మల్లీశ్వరి, యూన్సీ, సిహెచ్.సత్యవరలక్ష్మి, ధన, లక్ష్మి, రత్నాలు తదితరులు కోరారు. వర్క్‌డన్ రద్దు చేయాలని, తమ వేతనాలను వ్యక్తిగత అకౌంట్లలో వేయాలని, యూనిఫాం, ఐడి కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఉద్యోగ భద్రత విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెప్పారు. ఆర్‌పిలను తొలగించే ప్రక్రియ అంటూ ఏదీ లేదన్నారు. కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ బొండా జగన్, కరణం కనకారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 11, 12 తేదీల్లో ఢిల్లీలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎన్ రామారావు పిలుపునిచ్చారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో బుధవారం ఇపిఎఫ్ -95 పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.రామారావు మాట్లాడుతూ, కనీస పెన్షన్ రూ.9000, దానికనుగుణంగా డిఎ ఇవ్వాలని, భార్యాభర్తలకు మెడికల్ సౌకర్యం కల్పించాలని, రైల్వే ఛార్జీల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కణితి అప్పలరాజు, దేనిబందు, నమ్మి అప్పలనాయుడు, వెంకట్రావు, సింహాసనం, సోమినాయుడు పాల్గొన్నారు.



పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

లైంగిక దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి -గాజువాక : మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడంలో పాలకపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆందోళన వ్యక్తం చేసింది. గాజువాకలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యాన బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన నుద్దేశించి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు కె.వనజాక్షి మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో మహిళపై అత్యాచారం, విశాఖ హెచ్‌బి కాలనీలో బాలికపై లైంగిక దాడి జరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నేతలు పిల్లా పద్మ, దేవుడమ్మ, పుష్ప, మహిళలు పాల్గొన్నారు.

రోళ్ల పైడిమాంబ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లి గ్రామ దేవత రోళ్ల పైడిమాంబ అమ్మవారి 11వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, టిడిపి యువనేత గండి వంశీదీప్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అయిత ఎర్రిబాబు, విశ్వేశ్వరరావు, అయిత ఎర్రయ్య, అయిత చిన చిన్నోడు, దువ్వి అప్పారావు తదితరులు పాల్గొన్నారు

బోనిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బోని గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ శిబిరంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డి.గంగునాయుడు 90 మందికి వైద్య సేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 41 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌పిఎన్ గోవిందరావు మాట్లాడుతూ, హెచ్‌ఐవి సుఖ వ్యాధులు, టీబీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జశ్వంత్, హెచ్ఎఎన్ఎస్ కె.బాజియా, ఆశారత్నం, జానకి, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి -తగరపువలస : చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భీమిలి ప్రభుత్వ డైట్ అధ్యాపకులు ఎస్.త్రినాధరావు ఉపాధ్యాయులకు సూచించారు. జివిఎంసి ఒకటో వార్డు విల్లన్‌పేటలో ఉన్న జివిఎంసి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన బోధనాభ్యాసన సామగ్రిని ఆయన పరిశీలించారు. డైరీ, పాఠ్య ప్రణాళికలు, టీచింగ్ నోట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.భవానీ, జె.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయంపై నిరసనలు

సిపిఎం ఆధ్వర్యాన బడ్జెట్ ప్రతుల దహనం



దేవరాపల్లిలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న సిపిఎం నేతలు, ప్రజలు

ప్రజాశక్తి-దేవరాపల్లి
కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండి చెయ్యి చూపడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం దేవరాపల్లిలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ధరలు, నిరుద్యోగం, ఆకలి పెంచేదిగా ఉందని, పూర్తి ప్రైవేటీకరణ దిశలో ఉందని పేర్కొన్నారు. ప్రత్యేకహోదా, వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీతో పాటు ఇతర విభజన చట్టంలోని హామీలను పక్కన పెట్టిందన్నారు. రాజధాని నిర్మాణానికి గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంక్ రుణాన్నే పదే పదే ప్రస్తావించారని తప్పా కొత్తగా కేటాయింపు లేవన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ఆర్భాటంగా ప్రకటించిన రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రస్తావన బడ్జెట్‌లో లేదని, మరో వైపు ప్లాంట్‌కు గతేడాది కంటే రూ.5,327 కోట్లు బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల గురించి కనీసం మాట్లాడలేదన్నారు. పోలవరం నిర్వాసితుల పునరావసం, పరిహారం, ప్యాకేజీ గురించి స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కేంద్ర బిజెపి ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో ఎపిని పూర్తిగా మోసం చేసిన మోడీ ప్రభుత్వ విధానాలను ప్రజలు పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూలగుమ్మి ఎర్రునాయుడు, ఈశ్వరరావు, ఎరుకులమ్మ, అధికంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని ఎన్ నరసాపురం గ్రామంలో బుధవారం సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌ను, లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ కేంద్ర బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎం. రాజేష్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందని, ఈ బడ్జెట్ వలన రాష్ట్రంలో ఉపాధి కూలీలకు, కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గొర్ల రమణ, మనబాల రమణ, కుండల రమణ, వియ్యపు ప్రసాద్ పాల్గొన్నారు.

తగరపువలస : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన బుధవారం తగరపువలస జంక్షన్‌లో నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, ట్రిపుల్ ఐటి, గిరిజన యూనివర్సిటీ, వెనుకబడిన జిల్లాలకు నిధుల ఊసే లేదన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు నిధుల కేటాయింపు తగ్గించేసారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.అప్పలనాయుడు, ఆటో, ముఠా కార్మిక సంఘం నాయకులు నీలాతి రాము, ఎం.ఈశ్వరరావు, సూర్యారావు, కొత్తయ్యరెడ్డి, పల్లా రమణ, ఆర్.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : పిపిపి పేరుతో ప్రజల సొమ్మును కార్పొరేట్ల వ్యాపార ప్రయోజనాలకు మళ్లించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం విడనాడాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిఇసిహెచ్‌వి.సాగర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, దొర, సురేష్ పాల్గొన్నారు.


తగరపువలసలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న కార్మికులు


విద్యార్థులతో సెయింట్ జాన్స్ పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కశింకోట : దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న స్థానిక సెయింట్ జాన్స్ విద్యార్థులను ఆ పాఠశాల కరస్పాండెంట్ బత్తులు అనురాధ, డైరెక్టర్ బత్తులు నోబెల్ కుమార్ బుధవారం అభినందించారు. ఏటికొప్పాక బొమ్మలతో తయారు చేసిన సకటం మూడో స్థానం సాధించింది. ఈ శకటానికి ఆంధ్రప్రదేశ్ నుండి 16 మంది ప్రాతినిధ్యం వహించారు. వారిలో సెయింట్ జాన్స్ విద్యార్థులు విజయిన్ శ్రీ దేవి, పి. సాయ సుమితి, బాల ఆదత్య, హైదీప్, పి.ఎస్. సూర్య ప్రకాష్, శంకర్‌శ్రీ నారాయణ, సాత్విక్ తదితర ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. వారికి ప్రశాంసా పత్రాలు అందజేశారు.

మద్యం షాపుల దరఖాస్తు స్వీకరణ గడువు పెంపు

ప్రజాశక్తి-అనకాపల్లి, కశింకోట : గీత కులాల వారికి కేటాయించిన మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల ఐదు నుంచి 8వ తేదీ వరకు 50శాతం లైసెన్సు ఫీజు రాయితీతో పెంచడం జరిగిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది మిగిలిన 8 నెలలకు రోలుగుంట, ఎలమంచిలి రూరల్, చీడికాడ మండలాలకు 18 లక్షల 33 వేల 334 రూపాయలు, 2025-26 సంవత్సరానికి 30 లక్షల 25000 రూపాయలు, అనకాపల్లి రూరల్, మునగపాక, కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం, రాంబిల్లి, దేవరాపల్లి, బుచ్చయ్యపేట, పాయకరావుపేట, నక్కపల్లి, వి మాడుగుల, రావికమతం మండలాలకు మిగిలిన 8 నెలలకు 21 లక్షల 66 వేల 667 రూపాయలు, అలాగే 2025- 26 ఆర్థిక సంవత్సరానికి 35 లక్షల 75000 రూపాయలు కట్టవలసి ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈనెల 8 సాయంత్రం 5 గంటల లోపు స్వీకరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని గీత కులాలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి


ప్రజాశక్తి-అనకాపల్లి : పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు, హాస్టల్ వార్డెన్లు కృషి చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి కే రాజేశ్వరి సూచించారు. ఈ మేరకు స్థానిక గాంధీ నగరం సాంఘిక సంక్షేమ హాస్టల్, వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ హాస్టల్ సందర్శించారు. కళాశాల భవనానికి జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని వార్డెన్లకు సూచించారు. మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆమె వెంట అనకాపల్లి ఏఎస్‌డబ్ల్యూ ఓ ఈశ్వరరావు, హెచ్‌డబ్ల్యు రామయ్య పాల్గొన్నారు.

మార్చి 17 నుంచి ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) 10వ తరగతి పరీక్షలు ఈ ఏడాది మార్చి 17 నుంచి 28 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి అప్పారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 17న హిందీ, 19న ఇంగ్లీష్, 21న తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, 24న గణితము, భారతీయ సంస్కృతి, వారసత్వం, 26న సైన్స్, సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞాన శాస్త్రం, 28న సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

లక్ష్మీపురంలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి-చోడవరం : ఏకే మార్కెటింగ్ మూవీ క్రియేషన్స్ మేడిశెట్టి విజయ శ్రీకాంత్ నిర్మాణ సారథ్యంలో లవ్ అండ్ ఎంటర్టైన్మెంట్ సందేశాత్మక చిత్రం షూటింగ్ మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌ను ప్రముఖ నిర్మాత నట్టి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో రోడ్లు అభివృద్ధి చెంది పట్టణానికి ఏజెన్సీ ప్రాంతానికి అనుసంధానం అయినప్పుడు సినిమా షూటింగ్‌లకు నిర్మాతలు మరింతగా ముందుకు వస్తారని తెలిపారు. చోడవరం జడ్పిటిసి మేడిశెట్టి శ్రీకాంత్ నిర్మాతగా తన కుమారుడు అఖిల్‌తో ఈ సినిమా తీయడం అభినందనీయమన్నారు. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందని ఆకాంక్షించారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా భానుశ్రీ నటిస్తోంది. లక్ష్మీపురంలో పాటను చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్.సత్యారావు, గణపతి నాయుడు, సినిమా బృందం పాల్గొన్నారు.


ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొడుతున్న నట్టి కుమార్

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పోలీసు, నోడల్ అధికారులతో ఎస్‌పి తుహిన్ సిన్హా తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 24 పోలింగు స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించి వారికి శిక్షణ అందించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, తిరిగి తీసుకొనుటకు రిషప్షను కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రతి నిబంధనపై ఎన్నికల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ పోలీసు శాఖకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, ముఖ్యప్రణాళిక అధికారి జి. రామారావు, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి బివి.రాణి, జిల్లా రవాణా అధికారి మనోహర్, జిల్లా ప్రజా రవాణా అధికారిణి కె. పద్మావతి, డి.పి.ఆర్.సి. జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, డిపిఒ ఆర్.శిరీషారాణి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.ఇంద్రావతి, జిల్లా సర్వే అధికారి ఎస్. గోపాల రాజా, కలెక్టరేట సూపరింటెండెంట్‌లు డి.రాజేశ్వరి, పి.వి.రత్నం, ఎస్.వి.ఎస్.ఎస్.నాయుడు పాల్గొన్నారు.

ఆవు పాలు పూర్తిస్థాయిలో సేకరణ

దిగొచ్చిన విశాఖ డెయిరీ యాజమాన్యం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రైతుల నుండి ఆవు పాలలో 90 శాతం మాత్రమే సేకరించి 10 శాతం పాలను వెనక్కి పంపించే నిర్ణయాన్ని విశాఖ డెయిరీ యాజమాన్యం విరమించుకుంది. గతంలో రైతుల నుండి సేకరించే ఆవుపాలకు ఫ్యాట్ ఆధారంగా చెల్లించే నగదులో రూ.4 వరకు తగ్గించడంతో ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు వారం రోజుల క్రితం రైతుల నుండి సేకరించే ఆవుపాలలో 10 శాతం పాలను రైతులక వెనక్కి పంపించే నిర్ణయం చేసింది. దీంతో పాటి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఆందోళన నేపథ్యంలో విశాఖ డెయిరీ యాజమాన్యం రైతుల నుండి 100 శాతం ఆవుపాలను సేకరించాలని పాల కేంద్రాలకు సమాచారం ఇచ్చింది. దీంతో ఆవుపాల సరఫరా చేసే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ఫార్మా ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మాసిటీలో మూడు రోజులు పాటు నిర్వహించిన ఫార్మా ఎగ్జిబిషన్ బుధవారం ముగిసింది. డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ విజయ్ కుమార్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్‌లు ఎం శ్రీనివాసరావు, ఎన్ కళ్యాణి, వి.ఆదిప్రియ, జెఎన్‌పిపి మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెట్టి సుబ్బారావు, ఎంఎఎస్‌పిఎం అధ్యక్షులు ఎం శివరామ ప్రసాద్, అజాద్ కుమార్ శుక్ల జ్యోతి వెలిగించి ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. చివరి రోజు ప్రదర్శన ముఖ్యంగా కెమిస్ట్రీ, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్, ఫార్మా సూటికల్ సైన్‌లా తాజాపరిశ్రమల ట్రైలర్లను అప్రూవల్ తీసుకొనుటకు ఎంతగానో ఉపయోగపడింది.


ముగింపు కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని అన్ని పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళిక రూపొందించామని డిప్యూటీ డిఈఓ అప్పారావు చెప్పారు. మండలంలోని జంపపాలెంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ప్రగతి కార్డులు పరిశీలించి ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రణాళికా బద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జంపపాలెం పాఠశాల హెచ్‌ఎం ఏవిఎస్ శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం : పదవ తరగతి విద్యార్థులు మానసిక ధైర్యంతో మంచి మార్కులు సాధించాలని విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. బుధవారం చోడవరం, గవరవరం, దుడ్డుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆయన తనిఖీలు చేశారు. ఇటీవల జరిగిన ఫార్మేటివ్-3 పరీక్షల ప్రగతిని పరిశీలించారు. వెనుకబడిన విధ్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, సింహాచలం, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రంలో జిల్లా బ్లడ్ కోఆర్డినేటర్ లైలా గోపి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. సుమారు 50 మంది కంటి రోగులకు పరీక్షలు చేశారు. 15 మంది కంటి ఆపరేషన్లకు అర్హులు కాగా, వీరికి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహిస్తారని ఇన్చార్జి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యంలో డాక్టర్ హరిచందన, సహాయకులు సునంద, వనజ, శాంతి పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రభుత్వ పథకాలపై సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎపిడిఓ విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు., బుధవారం ఏంపిడిఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్వేలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఎమ్విఎస్ లవరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రేమ సమాజంలో చిన్నారులకు అన్నదానం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ తన కుమారుడు దేవా జన్మదిన వేడుకలు బుధవారం చోడవరం ప్రేమ సమాజంలో చిన్నారుల మధ్య నిర్వహించారు. నరేష్ దంపతులు తమ కుమారుడి చేత అక్కడే కేక్ కట్ చేయించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రేమ సమాజంలోని విద్యార్థులు, వృద్దులకు అన్నదానం చేశారు. ప్రేమ సమాజంలో అనాథ పిల్లల మధ్య తమ కుమారుడి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని నరేష్ దంపతులు తెలిపారు.

ఘనంగా సీతారాముల తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు గ్రామంలో బుధవారం శ్రీసీతారాముల తీర్థ మహొత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారిని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి శంకర్రావు, కె.గోవింద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జనరాజుదాస్ 12వ వర్ధంతి

ప్రజాశక్తి-మునగపాక : తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు పెంటకోట జనరాజుదాస్ 12వ వర్ధంతి బుధవారం స్థానిక గ్రామీణ యువజన మందిరం ఆవరణలో ఘనంగా జరిగింది. జనరాజుదాస్ అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు దర్శకులు, సూరిశెట్టి రాము, దాడి ముసలి నాయుడు, జడ్పిటిసి స్వామి సత్యనారాయణ, రంగస్థల కళాకారులు కాండ్రేగుల జగ్గారావు, టెక్కలి వీర కొండలరావు, ముల్లేటి సత్యనారాయణ, సూరిశెట్టి శ్రీను, పెంటకోట సత్యనారాయణ, దాడి శివ, ఎంఎం నాయుడు, ఆడారి గోవిందు పాల్గొన్నారు.

ఘనంగా కెజిబివి వార్షికోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థునులు ఆటపాటలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. ప్రత్యేకాధికారి సిహెచ్ భువన మాధురి మాట్లాడుతూ రానున్న పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి విద్యాలయానికి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు.

రూ.కోటి విలువైన ఫోన్లు బాధితులకు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పోలీసులు 9వ విడతలో రికవరీ చేసిన కోటి రూపాయల విలువ చేసే 503 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం మొబైల్ రికవరీ మేళాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, చత్తీస్గడ్, వెస్ట్ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు నుండి బాధితుల ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లపై ఇప్పటివరకు మొత్తం సుమారు 4,500 ఫిర్యాదులు నమోదు కాగా, మొత్తం 9 విడతల్లో 2,711 మొబైల్ ఫోన్లను (సుమారు రూ.4.07 కోట్లు విలువ) అందజేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ మిస్సింగ్ రిపోర్టింగ్ పోర్టల్ CEIR https://www.ceir.gov.in లో పోయిన మొబైల్ ఫోన్ వివరాలు అందించవచ్చున్నారు. మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్ 93469 12007 కు Hi అని టైప్ చేయడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా పోలీసులు, మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ మొబైల్ రికవరీలో విశేష కృషిచేసిన సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ కళ్యాణి, ఐటి కోర్ ఎస్సై సురేష్ బాబు, ఐటి కోర్ సిబ్బంది బి.గోవిందరావు, పి.కృష్ణవేణి, జి.సాయికుమారి దేవి, యమ్.దేవకీ , సిహెచ్.సునీత, డి.వి.రెడ్డి బాబు, సి.సి.ఎస్ సిబ్బంది ఎ.పరమేశ్వరరావు, యమ్.లక్ష్మీపతి రావులకు అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో



మొబైల్ రికవరీ మేళాలో పాల్గొన్న ఎస్‌పి తుహిన్ సిన్హా

అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు, డీఎస్పీ బి.అప్పారావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్లు ఎస్.బాల సూర్యరావు, టీ.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని డీకొట్టిన కారు

- విరిగి దానిపైనే పడిన వైనం
- తప్పిన పెను ప్రమాదం
- స్తంభాల నాణ్యతపై సందేహాలు



ఢీకొట్టిన కారుపై కూలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

కసింకోట బంగారు మెట్ట రోడ్లో పెద్దమదిన- రాజాం జంక్షన్‌కు మధ్య గల కొత్త తూనిక కేంద్రం సమీపంలో బుధవారం మధ్యాహ్నం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుండి ప్రయాణికులు బయటపడ్డారు. బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో వడ్డాది వైపు నుండి అనకాపల్లి వైపు వెళ్తున్న కారు వేగంగా ప్రయాణిస్తూ రోడ్డుకు కుడివైపు గల విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి, అదుపుతప్పి చెరువులోకి దూసుకుపోయింది. కారు వేగానికి విద్యుత్ స్తంభం విరిగి ఆ కారుపై పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

విద్యుత్ స్తంభం నాణ్యతపై అనుమానాలు

కారు ఢీకొట్టడంతోనే విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ఆ స్తంభం నాణ్యతపై ప్రయాణికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా నాణ్యతతో కూడిన ఇనుమును కట్టలుగా కట్టి కాంక్రీట్‌తో విద్యుత్ స్తంభాలు తయారు చేస్తారు. దశాబ్దాలపాటు ఉండాల్సిన స్తంభాల కోసం విద్యుత్ సంస్థలు నాణ్యణా ప్రమాణాలతో తయారు చేయిస్తాయి. రాజాం విద్యుత్ సబ్ స్టేషన్ నుండి పెద్దమదిన గ్రామానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా కోసం కొద్ది రోజుల క్రితం ఈ విద్యుత్ స్తంభాలు వేశారు. కారు ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయి చెరువులోకి దూసుకెళ్లిన కారుపై పడడంతో విద్యుత్ స్తంభాల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తుమ్మపాల ఫ్యాక్టరీ అమ్మకం సరికాదు



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులు షేర్ ధనంతో నిర్మించిన తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టడం సరైన పద్ధతి కాదని వీవీ రమణ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ విల్లూరి పైడారావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తాము అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని రైతులకు హామీ ఇచ్చి, ఇప్పుడు చేతులెత్తేయడం అన్యాయమన్నారు. ఫ్యాక్టరీని అమ్మాలని చూస్తున్న వ్యక్తినే ఈ ఫ్యాక్టరీకి ఎండీగా నియమించడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఫ్యాక్టరీకి ఎండీగా ఉన్న వ్యక్తిని తొలగించి అతనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో ఇప్పటికే పలు దొంగతనాలు జరిగినా ఎండీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఫ్యాక్టరీ షేర్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు గొర్లి మోదినాయుడు మాట్లాడుతూ వీవీ రమణ ఏ ఆశయాలతో ఫ్యాక్టరీని స్థాపించారో వాటిని కొనసాగించే విధంగా ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కషి చేసి రైతులను, కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు నాయకులు పీలా సీతారాం, కోరిబిల్లి శంకరరావు, కాళ్ల తేలయ్యబాబు, గండి నాయనబాబు, పెంటకోట జగన్నాధరావు, బుద్ద రంగారావు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రమాదాల నియంత్రణకు రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 2024లో ఎంవి నిబంధనలపై 95,183 ఈ-చలానాలు విధించినట్టు వెల్లడించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలని, సెల్ ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగు చేయకుండా చూడాలని సూచించారు. ప్రతీ రోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, వాహన తనిఖీలు చేపట్టి, ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. గత ఏడాది హెల్మెట్స్ ధరించని వారిపై 67,054, డ్రంక్ అండ్ డ్రైవ్ 4,388, ఓపెన్ డ్రింకింగ్ 12,318 మందిపై ఎం.వి.చలానాలను విధించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కేన్సర్‌పై మహిళలకు యుక్త వయసులో ఉన్న వారికి అవగాహన ఉండాలని ప్రాథమిక ఆరోగ్యక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య అన్నారు. స్థానిక పిహెచ్‌సి ఆవరణలో బుధవారం వివోఏలకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపిఎం శ్రీనివాసరావు, సీసీలు శ్రీను, రాజా రమేష్, సరోజినీ, సిహెచ్‌ఓ వేణుగోపాల్, స్టాఫ్ నర్సులు పావని పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : క్యాన్సర్ పై అప్రమత్తంగా ఉండాలని పిహెచ్‌సి వైద్యాధికారి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మహిళా సమైక్య భవనంలో గ్రామైక్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదపూడిలో తురకలపూడి పిహెచ్సి వైద్యాధికారిణి సంధ్యారాణి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో ఎం.రాజబాబు, సమైక్య అధ్యక్ష కార్యదర్శులు అమర పిన్ని వరలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఇసిసిఇ డే

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని కొత్తగొర్లివానిపాలెం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఇసిసిఇ డే, సిబి ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించారు. సబ్బవరం సిడిపిఓ పి.లలిత కుమారి పూర్వ ప్రాథమిక విద్య, అంకెలు, అక్షరాలు, ఆట- పాటలు, వస్తువులతో విద్యను అందించే విధానంపైనా, తల్లులకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎస్‌కె.షకీలా, అంగన్వాడీ కార్యకర్తలు సిహెచ్.దేవి, నూకరత్నం, ఏఎన్ఎం గౌతమి, ఎమ్ఎస్ కె యశోద, ఆశ కార్యకర్తలు ఎ.వరలక్ష్మి, ఎ.చంద్రకళ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెం-3 అంగన్వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ డెవలప్మెంట్ డే కార్యక్రమంలో బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఐసిడిఎస్ సీడీపీఓ ప్రభావతి చిన్న పిల్లలకు పోషకాహారం లోపం లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పడాల బొర్రమ్మ, పాల్గొన్నారు.

సచివాలయ సేవలు అందించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీని పైడివాడ అగ్రహారం సచివాలయంలో విలీనం చేయడంతో సుమారు పది కిలోమీటర్లు దూరంలో సచివాలయం ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు టీడీపీ బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసుపూడి రమణ ఆవేదన వ్యక్తం చేసారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే దీనిపై దష్టి సారించి తమ పంచాయితీని అసకపల్లి సచివాలయానికిగాని, సబ్బవరం-1 సచివాలయానికి గాని అనుసంధానం చేయాలని కోరారు.

వికలాంగ పింఛనుదారులకు సదరం క్యాంపు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడు సిహెచ్సి ఆవరణలో బుధవారం సదరం క్యాంపు నిర్వహించారు. ధ్రువపత్రాల ఆధారంగా పెన్షన్ పొందుతున్న వికలాంగులను కేజీహెచ్ నుండి ప్రత్యేకంగా వచ్చిన వైద్యులు తనిఖీలు నిర్వహించారు. మండలంలో 459 మంది వికలాంగ పెన్షన్ దారులు ఉండగా మొదటి రోజు చౌడువాడ-1, కొరువాడ సచివాలయ పరిధిలో ఉన్న 61 మందిని పరిశీలించారు. కేజీహెచ్ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రోహిత్ పరిశీలన చేశారు. సిహెచ్‌సి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి, ఎంపీడీవో సాంబశివరావు పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీకాకుళంలో ఈ నెల 6 నుండి 9 వరకు జరిగే అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు పిలుపునిచ్చారు.

లేబర్ కోడ్స్‌పై నిరసనల వెల్లువ



అనకాపల్లిలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన

రద్దు చేయాల్సిందే : కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలంటూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ప్రజా, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఎఫ్‌టియుఐ, ఎపిఎఫ్‌టియు తదితర అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిఎస్‌జె.అచ్యుతరావు, భోగవిల్లి నాగభూషణం, ఎన్.కనకారావు, దేవా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టిందన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని విమర్శించారు. మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను యజమాన్యాలకు బానిసలుగా చేస్తోందన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకొనే హక్కును, యజమానితో బేరసారలాడే హక్కును కోల్పోతారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. తొలుత జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ ఫ్లై ఓవర్ వరకు ప్రదర్శనగా వెళ్లి తిరిగి జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం లేబర్ కోడ్స్, కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.వెంకట్‌రెడ్డి, పి.మణి, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, ఉరుకూటి రాజు, టి.నూకరాజు, ఎఐటియుసి నాయకులు ఎం.మన్మథరావు, ఎస్‌కె.రహమాన్, కె.సత్యనారాయణ, బూసి వెంకటరావు, ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు, ఈశ్వరరావు, బాబూరావు, సిఎఫ్‌టియుఐ నాయకులు సురేష్, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : షిప్‌యార్డ్ మెయిన్ గేట్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సిఐటియు, ఇతర అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

గాజువాక : విశాఖ డెయిరీ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యాన 300 మంది కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, విశాఖ డెయిరీ యూనియన్ ప్రెసిడెంట్ ఎస్.రమణ, మణిబాబు, సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి ఎ.లోకేష్ పాల్గొన్నారు.

విశాఖ డైరీ వద్ద నిరసన

అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన భెల్ మెయిన్ గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిటిపి.ప్రకాష్, సీతమ్మనాయుడు, ఎస్.జగన్నాథరావు, కొల్లి దేవుడు, వారాడ ఆనందరావు, జి.చిన్నబాబు, మురళీశ్వరరావు, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

ములగాడ : కార్మికుల లేబర్ కోడ్స్ రద్దుచేయాలని కోరుతూ అఖిలపక్ష కార్మికసంఘాల ఆధ్వర్యాన హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు వద్ద నిరసన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర, కనీస వేతనం రూ.26 వేలు, స్థానికులకు ఉపాధి, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ ఆపాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవల్లి నాగభూషణం, సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, హెచ్‌పిసిఎల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి నరేష్, గంగాధర్, ఎస్.వాసు, బి.శ్రీను, బుజ్జి, కె.రాము, గణేష్, శంకర్, ఐఎన్‌టియుసి నాయకులు తాతబాబు పాల్గొన్నారు.


హెచ్‌పిసిఎల్ గేటు వద్ద కార్మిక సంఘాల నిరసన

పెందుర్తి : కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని దీన్ని యావత్ ప్రజానీకం, కార్మికవర్గం వ్యతిరేకించాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ పెందుర్తి మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, పద్మ, దేవి, కె.అప్పలనాయుడు, ఎన్.ప్రభుదేవా, ఈశ్వరరావు, ఎం.రాజు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఉక్కు ఎల్ అండ్ డిసి వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వైటి.దాస్, యు.రామస్వామి, గణపతిరెడ్డి, మసేన్‌రావు, దొమ్మేటి అప్పారావు, డి.శ్రీనివాస్, సురేష్ బాబు, మోహన్, విల్లా రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లి : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం అనకాపల్లిలో సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ స్టేడియం మీదగా నాలుగు రోడ్ల వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ అంబేద్కర్ విగ్రహం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, ఆర్.దొరబాబు మాట్లాడుతూ ఉన్న కార్మిక చట్టాల అమలు కోసం కార్మికులు పోరాడుతుంటే, వాటిని కూడా రద్దు చేసి, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను బిజెపి ప్రభుత్వం తీసుకురావడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు ఆర్.శంకర్రావు, గనిశెట్టి సత్యనారాయణ, దాకారపు శ్రీనివాసరావు, అజయ్, ఓమ్మి అప్పారావు, బి.రాము, వై.శివ, రాజు, భారతి, భాస్కర్, ఏఐటీయూసీ నేతలు పి సత్యనారాయణ, రైతు సంఘాల నాయకులు గండి నాయన బాబు, కోరిబిల్లి శంకర్రావు పాల్గొన్నారు.

యలమంచిలి : లేబర్స్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, నాయకులు జానకి, శ్రీనివాస్, వరలక్ష్మి, ప్రసన్న, అప్పలరాజు పాల్గొన్నారు.

రాంబిల్లి : 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, నాయకులు చందక రామకృష్ణ, ఎన్ఏఓబి నిర్మాణ, భవన నిర్మాణ, ఆటో, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కసిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, నాయకులు కె.సోము నాయుడు, లోకేష్, పవన్, గోవిందు, పరశురాము, సిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

పరవాడ : లేబర్ కోడ్స్ రద్దు చేయాలని పరవాడ ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు ఎస్ వెంకటలక్ష్మి, ఎన్ ఫైడ్ లక్ష్మి, ఎం ఉమా, టీ పరదేశమ్మ, సత్యవతి, ఐద్వా నేత పి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



పరవాడలో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో

'పయనీర్'లారీలను అడ్డుకున్న ప్రజలు


పయనీరు కంపెనీకి వెళ్లే వాహనాలను అడ్డుకున్న ప్రజలు

- భారీ వాహనాలతో రోడ్లన్నీ ఛిద్రమౌతున్నాయని నిరసన
- అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టడం లేదని ఆవేదన

ప్రజాశక్తి- కోటవురట్ల : మాకవరపాలెం మండలంలోని పయనీర్ అన్‌రాక్ రిఫైనరీ కంపెనీకి రాకపోకలు సాగించే భారీ వాహనాల కారణంగా రోడ్లన్నీ పోతున్నాయంటూ బుధవారం సెట్టిపాలెం, రాజుపేట, డుంగలవానిపాలెం, చింతలూరు, జడ్ గంగవరం, భీమబోయిన పాలెం, గ్రామాలకు చెందిన పలువురు భారీ వాహనాలను నిలువరించారు. విశాఖ పోర్ట్ నుండి పయనీర్ రిఫైనరీ కంపెనీకి భారీ వాహనాలు నిత్యం వస్తూ ఉండడంతో రోడ్లన్నీ ధ్వంసం అవ్వడమే కాకుండా మితిమీరిన వేగంతో వెళ్లడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ఆయాప్రాంత గ్రామస్తులంతా ఏకమై లారీలను అడ్డుకున్నారు, అనేక లారీలు రోడ్లపై నిలిచిపోవడంతో విశాఖ, నర్సీపట్నం నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు, పాఠశాలకు విద్యార్థులు సహా విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది, పరిమితికి మించి లోడుతో దుమ్ము ధూళి, శబ్ద కాలుష్యంతో వస్తున్న లారీలు కారణంగా తీవ్ర భయాందోళన చెందుతున్న గ్రామస్తులు, పలుమార్లు కంపెనీ యాజమాన్యానికి, సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో నిలుపుదల చేయక తప్పలేదని అంటున్నారు. లారీల రాకపోకలతో వచ్చే కాలుష్యంతోపాటు,కంపెనీ నుంచి కూడా విపరీతమైన ధూళి కణాలతో కూడిన పొగ కారణంగా సమీప ప్రాంత గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, అయా ప్రాంతాల్లో శ్వాస కోశ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు చేరుకొని రాకపోకలు సాగించే వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. సాయంత్రం పొద్దుపోయిన వరకు నిరసన కొనసాగింది.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలోని వెలుగు భవనం వద్ద బుధవారం రొమ్ము క్యాన్సర్ లక్షణాలపై డాక్టర్ ఝాన్సీరాణి వెలుగు సిబ్బందికి అవగాహన కల్పించారు .ఇన్‌ఛార్జి ఎపిఎం సత్యవతి ఆధ్వర్యంలో కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ, రొమ్ము, గర్భశయ క్యాన్సర్ సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు వివరించారు, ప్రధానంగా శారీరక శ్రమ లేకపోవడం, వంశపారపర్యంగా సంక్రమించే అవకాశం, చెడు వ్యసనాలు ప్రధాన కారణమని తెలిపారు, వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, విఒఎలు పాల్గొన్నారు.

నక్కపల్లి: రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, నోటి కేన్సర్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని నక్కపల్లి సిహెచ్‌సి గైనకాలజిస్ట్ డాక్టర్ వై జయలక్ష్మి, ఐసిటిఎస్ కౌన్సిలర్ ఆర్ రమణమ్మ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో .కేన్సర్ లక్షణాలు,నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి -మాడుగుల : విశాఖపట్నం,పాడేరు, అనకాపల్లి నుంచి వచ్చే బస్సులన్నీ మాడుగుల మీదుగా వెళ్లేందుకు వీలు కల్పించాలని జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్ గతంలో కలెక్టరేట్లో వినతి పత్రం అందించారు. ఈ మేరకు బుధవారం నర్సీపట్నం ఆర్డిఓ వివి.రమణ స్థానిక అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు.డిగ్రీ, జూనియర్ కళాశాల పక్కనుండి రోడ్డు ఏర్పాటుకు మాడుగుల ప్రజలు యువత విజ్ఞప్తి మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అయితే డిగ్రీ కళాశాలకు ఐదు ఎకరాల స్థలం ఉండాలని, లేకుంటే ఫండ్స్ రావని కళాశాల ప్రిన్సిపాల్ సివిఎస్ఎస్. శాస్త్రి ఆర్డీవో దృష్టికి తెచ్చారు. .దీని పై సమగ్ర పరిశీలన జరిపి నివేదక ఇవ్వాలని తహశీల్దారు కె.రమాదేవికి ఆర్‌డిఒ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొంకి అప్పారావు, డిటి లక్ష్మయ్య, పిఆర్ జెఇఇ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బి ఎఇ సాయి శ్రీనివాస్,విఆర్‌ఒ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గొలుగొండ : ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా మాజీ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ కోరారు. బుధవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మానసికంగా చెడు వ్యసనాలకు దారి తీయడానికి ప్రధానంగా నిరుద్యోగ సమస్య కారణమన్నారు. ఉన్నతమైన చదువులు కోచింగ్‌లు తీసుకుంటూ ప్రభుత్వాలపై నిరాశతో ఎదురుచూపులు చూస్తున్నారన్నారు. నిరుద్యోగ యువత కేంద్ర, రాష్ట్ర శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, యువత విద్య, ఉద్యోగం, ఉపాధి సమస్యలపై చర్చించి, ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో సీనియర్ మాజీ యువజన నాయకులు మేకా భాస్కరరావు, యూత్ నాయకులు సిహెచ్ భారత్ కుమార్, బ్రహ్మాజీ, మురళి, శివ పాల్గొన్నారు.

రబీ సాగు యాజమాన్యంపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి : రబీ సీజన్‌లో పంటలలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని డొంకాడ, ముకుందరాజుపేట, గొడిచెర్ల గ్రామాలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వరి, అపరాల సాగును పరిశీలించారు.

రబీలో వరిసాగులో ఎరువులు యాజమాన్యంపై వివరించారు. అపరాల్లో బూడిద తెగులు లేదా తుప్పుతెగులు ఆశించినపుడు నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున మాంకోజెబ్ లేదా 2 మిల్లీలీటర్ల చొప్పున హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట చివరి దశలో నీటి ఎద్దడి గమనించినట్లయితే ఎకరాకి ఒక కిలో పొటాషియం నైట్రేట్ (13-0-45) పిందె దశలో పిచికారి చేయడం ద్వారా నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు.ధాన్యం నూర్చిన రైతులు ఆర్ ఎస్ కే ద్వారా ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు.మండలంలో రబీ సేజన్ కు సంబంధించి సుమారు 110 ఎకరాల్లో వరి, 1050 ఎకరాల్లో అపరాల సాగు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సత్యన్నారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు సురేంద్ర, రజిత, రైతులు పాల్గొన్నారు.

పర్యాటకంగా తాండవ ప్రాజెక్టు అభివృద్ధి

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నాతవరం : నర్సీపట్నం నియోజకవర్గంలో ఏకైక సాగునీటి పెద్ద ప్రాజెక్ట్ తాండవ రిజర్వాయర్ అభివృద్ధిపైనా, పర్యాటకంగా తీర్చిదిద్దడంపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దృష్టిసారించిందనిఅసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం తాండవ ప్రాజెక్టు వద్ద 27 నీటి సంఘాలు, 324 మంది డైరెక్టర్లు, 27 మంది ప్రెసిడెంట్లు ఐదుగురు డిసి నెంబర్లతో ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అయ్యన్నపాత్రుడు, ముందుగా నల్గొండ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం సమావేశంలో మాట్లాడుతూ, వర్షాకాలానికి ముందే తాండవ మరమ్మత్తుల పనులు పూర్తిచేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. తాండవ ప్రాజెక్టును టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తుని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, జనసేన నర్సీపట్నం ఇంచార్జ్ రాజాన వీర సూర్య చంద్ర, తాండవ వైస్ చైర్మన్ మేడప రెడ్డి జోగు బాబు, పారిశ్రామికవేత్త, టిడిపి యువనేత వెలగా వెంకటకష్ణారావు పాల్గొన్నారు.

డోలిలో అత్తారింటికి!

మార్గమధ్యలో అస్వస్థతకు గురైన యువకుడు



డోలిలో బాబూరావును మోసుకెళుతున్న బంధువులు

ప్రజాశక్తి -కొత్తకోట : అనారోగ్య పీడితులను ఆసుపత్రికి తరలించేందుకు గిరిజనులకు డోలి మోతలు తప్పడం లేదు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ నేరేడుబంద గ్రామంలో బుధవారం విత్తనాల పండగ జరిగింది. ఈ పండగకు జికె వీధి మండలం పెద్దవలస పంచాయతీ పెద్దలంక గ్రామానికి చెందిన మర్రి బాబూరావు నేరేడుబందలోని అత్తారింటికి వెళ్లేందుకు చీమల పాడు చేరుకున్నాడు. నేరేడుబంద గ్రామానికి నడక మార్గంలో వెళు తుండగా మార్గం మధ్యలో స్పృహ తప్పి పడిపోయాడు సమాచారం అందుకున్న నేరేడుబందలోని బాబూరావు బంధువులు సకాలంలో చేరుకొని సపర్యలు చేశారు. చరణ్, సంజీవ్ అనే యువకుల సాయంతో సుమారు రెండున్నర కిలోమీటర్లు దూరం కొండపై డోలిలో తరలించారు. ప్రస్తుతం యువకుని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని గ్రామస్తులు కిల్లో పొట్టి దొర తదితరులు తెలిపారు.

రాజన్నపేటలో రీ సర్వేపై సమావేశం

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం రాజన్నపేట గ్రామంలో రెవెన్యూ రీ సర్వేపై నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణ బుధవారం రోలుగుంట తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాజన్నపేట గ్రామంలో 581.05 హెక్టార్లు ఉందని, దీనిపై రీ సర్వే చేయాలని తహశీల్దార్, సర్వేయర్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్గార్ నాగమ్మ, సర్వేయర్ తవిటి నాయుడు, ఆర్ఐ రామ్మూర్తి, వీఆర్వో భాస్కర్ పాల్గొన్నారు.

హెటిరోపై చర్యలు తీసుకోవాలి

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం



నక్కపల్లిలో డిటికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హెటిరో డ్రగ్స్ కంపెనీపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని హెటిరో డ్రగ్స్ కంపెనీలో విషవాయువులు లీకవడంతో అస్వస్థతకు గురైన 12 మందిలో కె.వీరబాబు, జి.గౌరి నాయుడు, జి.సుబ్రమణ్యం విశాఖలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి ఆయన కేర్ ఆసుపత్రికి బుధవారం చేరుకున్నారు. బాధితులను సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, విశాఖ జిల్లా నాయకులు పి.మణిలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయన్నారు. భద్రతా ప్రమాణాలను పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోతోందన్నారు. లాభాలే పరమావధిగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి తప్ప కార్మికుల ప్రాణాలను పట్టించుకోవడం లేదన్నారు. గతంలో హెటిరో పరిశ్రమలో ప్రమాదాలు సంభవించి కార్మికులు మరణించిన ఘటనలు ఉన్నాయన్నారు. అప్పుడే చట్టపరమైన చర్యలు తీసుకొని వుంటే ఈ ప్రమాదం సంభవించేది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాల పట్ల ఉదాసీనంగా ఉండడం వల్లే తరుచూ ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మంత్రులు, అధికారులు పర్యటనలు చేసి హడావుడి చేస్తున్నారు తప్ప వాటిని అరికట్టే చర్యలు చేపట్టడం లేదన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్స్ డిపార్టుమెంట్ నిరంతర పర్యవేక్షణ, సేఫ్టీ ఆడిట్ నిర్వహణ చేయకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని ఫార్మా పరిశ్రమల్లో వరుసగా ప్రమాదాలు, విషవాయువుల లీకేజీలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు.

సమగ్ర విచారణ జరపాలి : కోటేశ్వరరావు

అనకాపల్లి : నక్కపల్లి హెటిరో డ్రగ్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హెటిరోలో వాషవాయువులు లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన 12 మంది కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల విషయంలో కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే తరుచూ ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ప్రమాదాలకు కారణమైన కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మునగపాక : నక్కపల్లి హెటిరో డ్రగ్స్‌లో జరిగిన ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అనకాపల్లి : నక్కపల్లి హెట్రో డ్రగ్స్ ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొరబాబు మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో సంబంధిత శాఖల అధికారులు భద్రతా ఆడిట్ నిర్వహించకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

నక్కపల్లి :హెటిరో డ్రగ్స్ కంపెనీలో వాషవాయువులు లీకై 12 మంది కార్మికులు అస్వస్థకు గురైన సంఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. బాధితుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేర్ ఆసుపత్రికి తరలించగా, మిగిలిన 9మంది స్థానిక సిహెచ్‌సిలో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొద్దిపరిశ్రమలున్నప్పుడే వాటిల్లో భద్రతా చర్యలపై సక్రమ పర్యవేక్షణ చేయలేని ప్రభుత్వ యంత్రాంగం, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పేరుతో పెద్ద పరిశ్రమలు వస్తే అపుడు కార్మికుల భద్రత పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్, నాయకులు రాము పాల్గొన్నారు.

కోలుకున్న హెటిరో ఉద్యోగుల డిశ్చార్జి

హెటిరో విషవాయువుల లీకేజీ ప్రమాదంలో అస్వస్థతకు గురై, స్థానిక 50 పడకల ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న 9మంది ఉద్యోగులను బుధవారం ఉదయం వైద్యులు డిశ్చార్జ్ చేసారు. మిగిలిన ముగ్గురు విశాఖ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రమాద ఘటనపై ఉప తహశీల్దార్‌కు వినతి

హెటిరో కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదం చోటుచేసకుందని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ, స్థానిక ఉప తహసిల్దార్ అన్నాజీరావుకు బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఫార్మా పరిశ్రమల్లో భద్రతపై ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ నిరంతర పర్యవేక్షణ చేసి, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లోవరాజు, త్రినాధ్,వరహాలు, ప్రసాద్, సత్తిబాబు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

మండల సమావేశంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు



సమావేశం నిర్వహిస్తున్న ఎంపిపి, అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్ లు కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తాగునీరు, వైద్య ఆరోగ్యశాఖ, శానిటేషన్ విభాగాలపై మాత్రమే సభ్యులు చర్చించారు.వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు మాట్లాడుతూ చినదొడ్డిగల్లు, వేంపాడు కొత్తూరు తదితర గ్రామాల్లో 24 గంటల విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల తాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదని, 4 గ్రామాల ప్రజలు త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని కోరారు. పెదబోధిగల్లం పంచాయతీ సర్పంచ్ ఫాతిమా మున్నీషా బేగం మాట్లాడుతూ గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ పనులు వెంటనే పూర్తి చేసి, త్రాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఉపమాకలో జలజీవన్ మిషన్ పథకం పనులు త్వరతగతిన పూర్తి చేసి ఇంటింటికి కులాయి ద్వారా తాగునీటి సరఫరా చేయాలని ఎంపిటిసి కె. పార్వతి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్ డబ్ల్యూఎస్ ఎఇఇ నాగభూషణం మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించామని, 28 గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అయ్యేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే జడ్పీ నిధులతో 8 బోర్లు వేయడం జరిగిందన్నారు.

న్యాయంపూడి ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు, వేంపాడు ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు మాట్లాడుతూ నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి వచ్చే రోగులను రిఫెరల్ చేస్తున్నారని, అలా కాకుండా పూర్తిస్థాయిలో వైద్యం ఇక్కడ అందించాలని వైద్యులకు సూచించారు. గ్రామాల్లో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతంలో రోగుల ఇండ్లకు వెళ్లి వైద్యం చేయడం లేదని, విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మందులు కూడా రోగులకు సరఫరా చేయడం లేదన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ఒక్కరు కూడా పింఛన్లు మంజూరు కాలేదన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది మానవతా దృక్పథంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించాలన్నారు. ఎంపిటిసి సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, కనకారావు తదితరులు సమస్యలపై మాట్లాడారు.కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీ నానాజీ, డిటి

ఆక్రమణల తొలగింపు



చోద్యం జంక్షన్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో చోద్యం జంక్షన్‌లో కోర్టు తరపున ఆధారంగా చేసుకుని ఆర్ఎంబి స్థలంలో ఉన్న ఆక్రమణలను బుధవారం అధికారులు తొలగించారు. తన జిరాయితి భూమిలో ఆర్అండ్‌బి స్థలానికి అనుకొని ఆక్రమణ చేసిన ఇద్దరిని ఆ స్థలం నుండి తొలగించాలని గ్రామానికి చెందిన మద్దపు కామనాయుడు గతంలో కోర్టును ఆశ్రయించారు. ఆక్రమణ తొలగించాలంటూ రెండు సంవత్సరాల క్రితం అధికారులకు కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అప్పటినుండి ఆక్రమణదారులకు ప్రభుత్వ అధికారులు పలుమార్లు నోటీసులు అందజేసి హెచ్చరికలు ఇచ్చినప్పటికీ వారు ఖాళీ చేయలేదు.

దీంతో ఆర్అండ్‌బి జెఇఇ ప్రసాద్ మండల రెవెన్యూ అధికారులు గొలుగొండ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో కేడీపేట పోలీస్ సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణ తొలగించమని రెవెన్యూ ఆర్అండ్‌బి అధికారులు ఉదయం 10 గంటల సమయంలో లబ్ధిదారులకు చెప్పినప్పటికీ వారు ఖాళీ చేయమని అధికారులను వ్యతిరేకించారు. దీంతో సంబంధిత శాఖ అధికారులు పోలీసు సిబ్బందికి తెలియజేసి వారి సమక్షంలో ఆక్రమణలు తొలగించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వీఆర్వోలు గోవర్ధన్, మోహన దుర్గా, శ్రీనివాసరావులు, విఆర్ఎలు రమణ, నరేంద్ర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.